పోస్టల్ బ్యాలెట్‌లో పోలైన ఓట్లు 7,588

కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, మే 5: జిల్లాలో ఇప్పటి వరకు 7,588 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వినియోగించుకున్నట్లు కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 26,150 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈనెల 3 నుంచి జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ చేపడుతున్నామన్నారు. తొలి రెండు రోజులు శుక్ర, శనివారం కలిపి జిల్లా వ్యాప్తంగా 4,521 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. మూడో రోజు ఆదివారం అత్యధికంగా జిల్లా వ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాల్లో కలిపి సాయంత్రం 4-30 గంటల వరకు 3,067 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటు వేశారని కలెక్టర్ వెల్లడించారు. ఈ లెక్కన ఈ మూడు రోజులు రాయదుర్గం నియోజకవర్గంలో 1877 మందికి గాను 480 మంది, ఉరవకొండలో 2,124 కి గాను 647 మంది, గుంతకల్లులో 3,032 కి 988 మంది, తాడిపత్రిలో 2388 మందికి 927 మంది, శింగనమలలో 1810 మందికి 563 మంది, అనంతపురంఅర్బన్‌లో 6,594 మందికి 1846 మంది, కళ్యాణదుర్గంలో 2,566 మందికి 694మంది, రాప్తాడు నియోజకవర్గంలో 3,528 మందికి గాను 1191 మంది ఇప్పటి వరకు పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు వినియోగించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.



పోస్టల్‌కు బదులు హోమ్ ఓటింగ్ కవర్లు

రాప్తాడు, మే 5: రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీ కార్యాలయంలో ఈనెల 3వ తేదీ నుంచి కొనసాగుతోంది. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 651 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వినియోగించుకున్నారు. సాయంత్రం వరకూ మొత్తం 1200 మంది పీఓ, ఏపీఓ, ఓపిఓలు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. సాయంత్రం దాదాపు 10 మంది ఓటర్లకు పోస్టల్ ఎనవలప్ కవర్లకు బదులు హోమ్ ఓటింగ్ ఎనవలప్ కవర్లు ఇచ్చారు. పోస్టల్‌కు బదులు హోమ్ ఓటింగ్ ఎనవలప్ కవర్ ఎందుకు ఇచ్చారని, ఆ పది ఓట్లు చెల్లుతాయా అని ఆ ఓటర్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై నోడల్ అధికారి పరమేశ్వరరావును వివరణ కోరగా.. పోస్టల్, హోమ్ ఓటింగ్ ఎనవలప్ కవర్లలో ఏ ఎనవలప్ కవర్లు ఉపయోగించినా ఓట్లు చెల్లుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.



పింఛన్ వచ్చినా.. బ్యాంకులో కోత


లక్ష్మీదేవి, ఎగువతూపల్లి

నంబులపూలకుంట, మే 5: పింఛన్‌దారుల కష్టాలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. బ్యాంకు ఖాతాలో జమ అయినా చేతికి తీసుకోలేక వృద్ధులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. చాలామంది లబ్ధిదారులు బ్యాంకు ఖాతాలు తెరిచి లావాదేవీలు జరపకపోవడంతో జమ అయిన నగదు కోతకు గురైంది. నంబులపూలకుంట మండలంలోని ఎగువతూపల్లికి చెందిన లక్ష్మీదేవికి మే నెలలో ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ రూ.3వేలు బ్యాంకు ఖాతాకు జమ చేసింది. బ్యాంకులో పనిచేసే తమ గ్రామ కోఆర్డినేటర్ వద్దకు వెళ్లి ఆధార్‌కార్డుతో పింఛన్ జమ అయిన విషయం తెలుసుకున్నారు. లక్ష్మీదేవి ఖాతాలో గతంలో రూ.500 ఉండేది. పింఛన్ తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్లగా రూ.1500 మాత్రమే ఖాతాలో ఉన్నట్లు సిబ్బంది చెప్పడంతో ఆమె అవాక్కయింది. దీనిపై బ్యాంకు సిబ్బందిని అడుగగా.. ఖాతా తెరచిన తరువాత లావాదేవీలు తప్పకుండా జరపాలని, లేనిపక్షంలో బ్యాంకు నిబంధనల మేరకు డబ్బులో కోత పడుతుందన్నారు.

అమ్మకు మోసం..!

జగనన్న అమ్మ ఒడి

పిల్లల చదువుల బడి

ఆంక్షల పేరుతో 'అమ్మఒడి'లో కోతలు
మాట తప్పి..మడమ తిప్పిన జగన్
ఐదో ఏడాది జమకాని నగదు

ధర్మవరం: 'అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటా.. మీ ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలుంటే అంతమందికి ఏడాదికి రూ.15వేలు చొప్పున అమ్మఒడి ఇస్తాను.. మీరు వారిని మంచి చదువులు చదివించుకోవచ్చు' అని గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో జగన్ మాట ఇచ్చి అధికారంలోకి రాగానే మడమ తిప్పేశారు. ఇంట్లో ఎంతమంది ఉన్నా ఒక్కరికే అమ్మఒడి ఇస్తూ.. అనేక ఆంక్షలు పెట్టి కోత వేసి అక్క చెల్లెమ్మలను మోసం చేశారు. ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలలో అమ్మఒడి పథకం ఒకటి. ఈ పథకాన్ని నవరత్నాలలో చేర్చుతున్నట్లు చాలా గొప్పగా చెప్పారు. ప్రతి ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే వారందరికి ఏడాదికి రూ.15వేలు చొప్పున ఇస్తామన్నారు. హామీ ఇచ్చేటప్పుడు ఈ పథకంలో అర్హుల ఎంపికకు ఎటువంటి నిబంధనలు పెట్టబోతున్నారో? ఎక్కడా చెప్పలేదు. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోగాని జగన్‌రెడ్డి ఈ పథకంపై మొదటిసారి మాట తప్పి మడమ తిప్పేశారు. ఇంట్లో ఒక విద్యార్థికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. మొదట ఏడాది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.15వేలు జమచేశారు. రెండో ఏడాది కరోనా కోటాలో అమ్మఒడికి బ్రేక్ పడింది. మూడో ఏడాది జగనన్న మరోసారి మాట తప్పారు. పాఠశాలల మరుగుదొడ్ల నిర్వహణ పేరుతో రూ.15వేలు నుంచి రూ.14వేలకు కుదించారు. అర్హుల ఎంపికలో అప్పటి వరకు లేని కొత్త నిబంధనలు వచ్చి చేరాయి. నాలుగో ఏడాదిలో దానిని రూ.13వేలకు తగ్గించారు. ఐదో సంవత్సరం రూ.13వేలకు బటన్ నొక్కినా తల్లుల ఖాతాలోకి డబ్బు జమకాలేదు. ఎప్పుడో నెల, రెండు నెలల తరువాత (కొందరికి విడతల వారీగా) ఖాతాలోకి పడింది. సత్యసాయి జిల్లా ఏర్పడిన తరువాత 2022-23 సంవత్సరంలో 1లక్ష 69వేల మంది విద్యార్థులకు అమ్మఒడి వచ్చింది. 2023-24 సంవత్సరంలో 1,60,397 మంది విద్యార్థులకు మాత్రమే తల్లుల ఖాతాలోకి జమచేశారు. మిగిలినవారికి నిబంధనల పేరుతో ప్రభుత్వం ఎగనామం పెట్టింది.



ఎన్ని నిబంధనలో..

రాష్ట్ర ప్రభుత్వం 2020 జనవరిలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదట చెప్పిన ప్రకారం తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదివే పిల్లలకు అమ్మఒడి పథకం వర్తిస్తుంది. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు అర్హులు. తల్లి ఆధార్‌కార్డు, విద్యార్థి ఆధార్‌కార్డు ఉండాలి. పాఠశాలలు, కళాశాలల్లో 75 శాతం హాజరుకావాలి. ప్రభుత్వ ఉద్యోగులు అయి ఉండకూడదు. ముందుగా ఇటువంటి నిబంధనలే ఉన్నాయి. తరువాత విద్యుత్ బిల్లులు 300 యూనిట్లకు మించకూడదని, కారు ఉండకూడదని.. వంటి అనేక నిబంధనలు చేర్చారు. ఫలితంగా ఏటా అమ్మఒడి లబ్ధిదారులు తగ్గిపోతూనే ఉన్నారు. కొత్తగా పాఠశాలల్లో చేరే విద్యార్థులతో పోల్చితే అమ్మఒడి లబ్ధిదారుల సంఖ్య పెరగలేదు. దీంతో అమ్మఒడి పథకంపై తల్లులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

ఒక్కరికే ఇస్తే.. మిగిలిన బిడ్డలూ..?

నాకు ఇద్దరు ఆడబిడ్డలు. వీరిని చదివిస్తున్నా. ఒకరికి మాత్రమే అమ్మఒడి వస్తోంది. నా భర్త బేల్దారి పనులు చేస్తాడు. చాలీచాలని డబ్బుతో పిల్లలను చదివించడం కష్టంగా ఉంది. చంద్రబాబు నాయుడు ఎంత మంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం కింద రూ.15వేల చొప్పున ఇస్తా అంటున్నారు. ఆ పథకంతో నా పిల్లలు చదివించుకుంటా.

- శ్రీదేవి, ధర్మవరం

ఇన్ని షరతులా..? : స్వర్ణలత, ముదిగుబ్బ

ఇంట్లో చదువుకునే పిల్లలందరికీ అమ్మఒడి పథకం కింద రూ.15వేలు ఇస్తామన్నారు. కానీ ఇంట్లో ఒక్కరికే ఇస్తున్నారు. అది కూడా ఎక్కడా లేని నిబంధనలు పెట్టారు. 75 శాతం విద్యార్థుల హాజరు శాతం ఉండాలంట. 300 యూనిట్లు కరెంటు కాలకూడదంట. రూ.15వేలు అయినా సక్రమంగా ఇచ్చారా? అంటే అదీలేదు. మూడోసారి వేయి, నాలుగోసారి రూ.2వేలు కోత పెట్టారు.

అమ్మఒడి అట్టర్‌ఫ్లాప్ : పెద్దన్న, కొత్తపేట, ధర్మవరం

అమ్మఒడి అట్టర్ ఫ్లాప్ పథకం. కుటుంబం లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి అమ్మఒడి పథకాన్ని ఇస్తామని ఎన్నికల సమయంలో జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఒకరికి మాత్రమే అని మాట మార్చారు. తరువాత కరెంటు బిల్లులు, ఇన్‌కంటాక్స్, భూములు, స్థలాలు, సొంత ఇళ్లు వంటి నిబంధనలు పెట్టారు. మొదటి సంవత్సరం ఒక్కొక్కరికి రూ. 15వేలు, రెండో సంవత్సరం రూ. 14వేలు, తరువాత దానిని రూ.13వేలకు కుదించారు. ఈ ఐదేళ్లలో మాకు మూడుసార్లు మాత్రమే అమ్మఒడి వచ్చింది. మిగిలిన రెండుసార్లు సాకులతో మొండిచెయ్యి చూపారు.

మూలనపడ్డ మగ్గం

సంక్షోభంలో చేనేత పరిశ్రమ
ప్రభుత్వ ఆదరణ కరువు
గిట్టుబాటు లేక కులవృత్తికి దూరమవుతున్న నేతన్న

ఒకప్పుడు మగ్గం నేసి కుటుంబాన్ని పోషించుకున్న చేనేత కార్మికులు నేడు నేత పనికి దూరమైపోతున్నారు. మరమగ్గాలు రావడంతో చేనేత పరిశ్రమ కుదేలైపోయింది. దీనికి తోడు పాలకులు అవలంబిస్తున్న విధానాలతో చేనేత పరిశ్రమ మరింత సంక్షోభంలోకి కూరుకుపోతోంది. ఒకప్పుడు ఉరవకొండలో మూడువేలకు పైగా మగ్గాలు ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మగ్గాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. చాలామంది చేనేత కార్మికులు మగ్గాలను మూలనపడేసి చిన్నచిన్న దుకాణాలు, హోటళ్లలో కూలీలుగా మారిపోయారు.

ఉరవకొండ: వ్యవసాయం తర్వాత అతి పెద్ద రంగమైన చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతోంది. పాలకుల నిర్లక్ష్యం, ప్రభుత్వ విధానాలతో మగ్గం రానురానూ మూలకు చేరుతోంది. మగ్గం పనికి వెన్నెముక లాంటి ఉపవృత్తులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. దీనికి తోడు చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ విధించడంతో గిట్టుబాటు కాక నేతన్నలు అనారోగ్యం, అప్పులు, ఆకలితో అలమటిస్తూ ఇతర వృత్తుల్లోకి పోతున్నారు. ఉరవకొండలో గతంలో మూడువేలకు పైగా మగ్గాలు ఉండేవి. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో మగ్గాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. చేనేతకు ప్రభుత్వ ఆదరణ కరువైంది. రానురానూ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో మగ్గాలు మూలనపడ్డాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మరీ దారుణంగా తయారయింది.


చేనేత మగ్గం

సంక్షేమ పథకాలకు చెల్లుచీటీ

- ఐసీఐసీఐ లాంబర్డ్ ఇన్సూరెన్స్ పథకాన్ని పూర్తిగా నిలిపివేశారు. ఈ పథకంలో చేనేత కార్మికుడు రూ100లు చెల్లిస్తే ఏడాది పాటు రూ.15వేలు ఆరోగ్య బీమా వర్తించేది.
- బునకర్ బీమా యోజన పథకంలో రూ.80కే ఇన్సూరెన్స్ కల్పించేవారు. ఈ పథకంలో కుటుంబ యజమాని సాధారణ మరణం చెందితే రూ.60వేలు, ప్రమాదవశాత్తు అయితే రూ.1.5 లక్షలు ఇచ్చేవారు. ఈ పథకం కూడా అమలులో లేదు.
- ఎన్‌హెచ్‌డీసీ పథకంలో చేనేత కార్మికుడికి నూలు కొనుగోలుకు 10 శాతం రాయితీ ఇచ్చేవారు. ఈ పథకం అమలులో లేదు.
- ఎన్‌సీడీసీ (నేషనల్ క్రెడిట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) పథకంలో కార్మికులకు ముద్రా యోజనా రుణాల కింద రూ.50వేలు బ్యాంకు రుణాలు ఇచ్చే పథకాన్ని కూడా నిలిపి వేశారు.
- గతంలో మగ్గం నేసే కార్మికులకు వర్క్‌షెడ్ కోసం రూ.75వేలు ఇచ్చేవారు.

రాయితీలన్నీ కట్

నూలుపై రాయితీ, పావలా వడ్డీ, రిబేట్‌పథకం, మార్కెటింగ్ ప్రోత్సాహక పథకం నిలిపివేశారు. వీటి వల్ల చేనేత కార్మికులకు ఏడాదంతా చేతినిండా పనితో పాటు కూలీ గిట్టుబాటు అయ్యేది. ఒక్కో చేనేత కార్మికుడికి సుమారు రూ.50వేల ఆదాయం పరోక్షంగా సమకూరేది. దీంతో చేనేత కార్మికుడికి శ్రమకు తగ్గ ఫలితం ఉండేది. వైసీపీ వచ్చిన తర్వాత రాయితీలన్నీ ఎత్తి వేసింది. కానీ చేనేతలకు సంక్షేమ పథకాలంటూ గొప్పలు చెప్పుకుంటోందని ఆ వర్గాల కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మగ్గం అమ్మేశా : లక్ష్మీనారాయణ, చేనేత కార్మికుడు

చేనేత పనిలో గిట్టుబాటు కాకపోవడంతో మగ్గం, రాట్నం అమ్మేశా. విధిలేని పరిస్థితుల్లో వేరే పనిలోకి వెళుతున్నా. వేరే పనుల్లో వెళ్లాలంటే బాధగా ఉంది. పెయింటింగ్ షాప్‌లో పనిచేస్తున్నా. చేనేత పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలి.

రాయితీలు ఎత్తేశారు



తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేనేతలకు ఆదరణ పథకం కింద యంత్ర పనిముట్లు ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం రాయితీలన్నీ ఎత్తేసింది. సంక్షేమం అంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. నేతన్న నేస్తం రూ.24వేలతోనే సరిపెట్టారు. నేసిన చీరలకు గిట్టుబాటు కాక, కులవృత్తిని వదులుకుని షాపుల్లో పనిచేయడానికి వెళ్తున్నాం.

- నాగరాజు, చేనేత కార్మికుడు

భారంగా జీవనం : ప్రమీల, చేనేత కార్మికురాలు



కుటుంబమంతా పనిచేసినా సంపాదన అంతంతమాత్రంగానే వస్తోంది. నేసిన చీరకు కూడా 20 రోజుల తర్వాతే కూలి డబ్బులు ఇస్తారు. కంతులు, గ్రూప్ డబ్బులు కట్టుకోవాలన్నా ఇబ్బందికరంగా ఉంది. కుటుంబపోషణ భారంగా మారింది.

పూర్వ వైభవం తేవాలి




కుటుంబమంతా పనిచేసినా రోజుకు రూ.200 కూడా రావడం లేదు. చేనేతలకు పూర్వ వైభవం వచ్చేలా ప్రభుత్వాలు మార్పులు తీసుకురావాలి. ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి చేనేత పరిశ్రమను ఆదుకోవాలి.


- రఘు, చేనేత కార్మికుడు

మూడేళ్లైనా మరమ్మతులేవీ..?

- పట్టించుకోని ప్రభుత్వం


మోపిడి వద్ద దెబ్బతిన్న లింక్ కెనాల్ రెగ్యులేటర్

ఉరవకొండ: మండలంలోని మోపిడి వద్ద పీఏబీఆర్ లింక్ కెనాల్ రెగ్యులేటర్ కూలిపోయి మూడేళ్లయినా వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. రెగ్యులేటర్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో మూడేళ్ల కిందట కూలిపోయింది. జిల్లాకు సాగు, తాగునీటికి వరప్రసాదిని అయిన ఈ కాలువపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. హెచ్చెల్సీ ఆధునికీకరణలో భాగంగా ఈ పనులు చేపట్టాల్సి ఉంది. ఆధునికీకరణ పనులు చేపట్టి పుష్కర కాలం దాటినా నేటికీ ముందుకు సాగలేదు. ఈ కాలువ ద్వారా 500 క్యూసెక్కులకు తరలించేందుకు కూడా ఇబ్బందికరంగా ఉంది. కాలువకు కూడా సిమెంట్ పెచ్చులూడిపోయి అధ్వానంగా ఉంది. లింక్ కాలువ ఆధునికీకరణ కలగా మారింది. మరమ్మతులకు రూ.60కోట్లతో అధికారులు మూడేళ్ల కిందట ప్రతిపాదించారు. నేటికీ నిధులు మంజూరు కాలేదు. హెడ్‌రెగ్యులేటర్ కూలిపోయి మూడేళ్లవుతున్నా దానికి మరమ్మతులు చేయకుండా వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతు సమస్యలను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందనడానికి ఇదొక నిదర్శనంగా మారింది.


చెల్లాచెదురుగా పడి ఉన్న షెట్టర్లు

బడుగుల కోసం ఆవిర్భవించిందే తెలుగుదేశం

హిందూపురం లోక్‌సభ అభ్యర్థి బీకే పార్థసారథి

హిందూపురం, మే 5 : బడుగు, బలహీనవర్గాల కోసం ఆవిర్భవించిందే తెలుగుదేశం పార్టీ అని హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. ఆదివారం హిందూపురంలోని జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వాల్మీకుల ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బడుగు బలహీనవర్గాల కోసం ఎప్పుడూ పోరాటం చేస్తుందన్నారు. ముఖ్యంగా ఈ జిల్లాలో వాల్మీకులు, కురుబలకే తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేసిందన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా వాల్మీకులకు అవకాశం కల్పించింది టీడీపీనే అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలుగా కూడా వాల్మీకులకు అవకాశం కల్పించిందన్నారు. భవిష్యత్తులో కూడా పార్టీ అండగా ఉంటుందన్నారు. హిందూపురం నియోజకవర్గంలో నందమూరి బాలకృష్ణ బీసీలకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి దోహదపడాలన్నారు. వాల్మీకుల సమస్యలపై పార్లమెంట్‌లో పోరాటం చేస్తానని అన్నారు. దేశం, రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం వస్తోందని, వచ్చే ఐదేళ్లలో అంతా మంచే జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, అఘాయిత్యాలను దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విలువైన రెండు ఓట్లను సైకిల్ గుర్తుకు వేసి మెజార్టీ వచ్చేలా కృషిచేయాలన్నారు. తెలుగుదేశం, టీడీపీ, జనసేన, రాష్ట్ర భవిష్యత్తు కోసం పోరాటం చేస్తున్నాయని, వీరికి రాష్ట్ర ప్రజలు అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. హిందూపురం అసెంబ్లీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ, వాల్మీకి సంఘం నాయకులు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి


బాలకృష్ణతో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

వైసీపీ పాలనలో కులవృత్తులకు మోసం

- నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు కడదరకుంట నాగరాజు



తెలుగుదేశం పాలనలో కులవృత్తులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కులవృత్తులకు మోసం చేశారు. గత ఎన్నికల సమయంలో సీఎం జగన్ కుల వృత్తిదారులకు న్యాయం చేస్తానని చెప్పి, ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారు. టీడీపీ పాలనలో నాయీ బ్రాహ్మణులకు అవసరమైన పనిముట్లు అందించారు. పది మంది కలసి గ్రూపుగా ఏర్పడి సబ్సిడీ రుణాలు తీసుకున్నాం. బీసీ కార్పొరేషన్ కింద కులవృత్తులకు సబ్సిడీ పథకాలు వచ్చేవి. వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి జగన్ అన్ని పథకాలు ఎత్తివేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. కులవృత్తిదారులకు అండగా నిలబడుతామని ప్రకటించిన చంద్రబాబునాయుడుకు మేము అండగా నిలబడుతాం.

- కూడేరు

మైనార్టీలపై కపట ప్రేమ

పేదపిల్లల పెళ్లిళ్లకు లక్ష ఇస్తానంటూ ఎగనామం
జగన్‌రెడ్డిపై మండిపడుతున్న ముస్లింలు



పుట్టపర్తి రూరల్: పేద ముస్లింల కోసం తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దుల్హన్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో పేదముస్లిం మహిళలకు పెళ్లి కానుకగా రూ. 50వేలు పెళ్లి రోజున అందించేవారు. ప్రతిపక్షనేతగా ఉన్న జగన్‌రెడ్డి పేదముస్లిం మహిళలకు ఇచ్చే పెళ్లికానుక రూ. 50వేలు ఏమాత్రం సరిపోవని, తాను అధికారంలోకి వస్తే లక్షరూపాయలు అందిస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని ప్రతి ఎన్నికల సభలోనూ ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక ఆ పథకం వైపు ఆలోచన కూడా చేయలేదు. దీంతో పేద ముస్లింలు తమ పిల్లల పెళ్లిళ్లకు లక్ష రూపాయలు పెళ్లికానుక ఇస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చాక పథకాన్ని అటకెక్కించడంపై మండిపడుతున్నారు. పెళ్లికూతురు పదోతరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, ఈ రాష్ట్రానికి చెందిన అమ్మాయే అయి ఉండాలని.. ఇలా రకరకాల షరతులు విధించి పథకాన్ని అందకుండా చేశారని వాపోతున్నారు. కులం చూడం, మతం చూడం, మాటతప్పం.. మడమతిప్పం అంటూ ఎన్నికల ప్రసంగాల్లో దంచికొట్టిన జగన్‌కు తమకు మొండిచేయి చూపారని మైనార్టీ వర్గాలు మండిపడుతున్నాయి.

చంద్రబాబు ముస్లింలను ఆదుకున్నారు : షంషాద్ బేగం, కదిరి

మాలాంటి పేదలు ఆడబిడ్డలకు పెళ్లిళ్ల చేయడానికి ఎంతో ఇబ్బందులు పడుతుండగా గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దుల్హన్ పథకాన్ని ప్రవేశ పెట్టి ఆదుకున్నారు. పేద ముస్లిం తల్లిదండ్రులకు దుల్హన్ పెళ్లికానుక ఎంతో భరోసానిచ్చేది. జగన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే లక్ష రూపాయలు ఇస్తానని నమ్మించి ఉన్న పథకాన్ని కూడా రద్దుచేశారు. ఈ ప్రభుత్వాన్ని రద్దుచేసే టైమొచ్చింది.

ఎన్నికల వాగ్దానం నెరవేర్చని జగన్ : రేష్మా, ధర్మవరం

దుల్హన్ పథకం కింద పేద ముస్లింలకు ఇస్తున్న పెళ్లి కానుకను తాను అధికారంలోకి వస్తే రూ.50వేల నుంచి లక్ష రూపాయలకు పెంచుతానని గత ఎన్నికల్లో జగన్‌రెడ్డి వాగ్దానం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అందిస్తున్న రూ. 50వేలు పెళ్లికి ఏమాత్రం సరిపోదని చెప్పి మాతో ఓట్లు వేయించుకున్నారు. లక్షరూపాయలు ఇస్తానని చెప్పిన హామీని నిలబెట్టుకోలేకపోయారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

సిగ్మండ్ ఫ్రాయిడ్ (జయంతి)



ఆస్ట్రియా దేశానికి చెందిన ప్రముఖ మానసిక శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ 1856 మే 6న జన్మించారు. మానసిక శాస్త్ర పాఠశాలను స్థాపించారు. మానసిక విశ్లేషణ (సైకో అనాలసిస్) అంశాలపై రాసిన పుస్తకాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. చికిత్సలో మెళకువలు, మానవ జీవిత ఉత్ప్రేరకశక్తిని వెలికి తీసే వివరణతోపాటు సాహిత్యం, న్యూరాలజీ తదితర అంశాలలో రాణించారు. 1939 సెప్టెంబరు 16న కన్నుమూశారు.

జార్జ్ ఆర్సన్ వెల్స్ (జయంతి)



జార్జ్ ఆర్సన్ వెల్స్ 1915 మే 6న జన్మించారు. అమెరికాకు చెందిన ప్రముఖ నటుడు, దర్శకుడు, స్క్రీన్ రైటర్, నిర్మాత. రేడియో, నాటకం, సినీ రంగాలలో ఆయన సేవలు చిరస్మరణీయంగా నిలిచాయి. గొప్ప దర్శకుడిగా నిలిచారు. యుద్ధం జరిగిన సంవత్సరాలలో ట్రూప్ వెరైటీ షోలలో మెజీషియన్‌గా ఎనలేని సేవలందించారు. 'ది క్రాడిల్ విల్ రాక్' సినిమా ఎంతో పేరొందింది. 1985 అక్టోబరు 10న కన్నుమూశారు.

లీలా సామ్సన్ (పుట్టినరోజు)



పద్మశ్రీ గ్రహీత లీలా సామ్సన్ 1951 మే 6న తమిళనాడు రాష్ట్రం కూనూర్ ప్రాంతంలో జన్మించారు. భరతనాట్య కళాకారిణి, కొరియోగ్రాఫర్, ఇన్‌స్ట్రక్టర్, రైటర్‌గా రాణించారు. కళాక్షేత్రకు డైరెక్టర్‌గాను, సంగీత నాటక అకాడమీకి చైర్‌పర్సన్‌గాను, సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌కు చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. దేశ విదేశాలలో భరతనాట్యం ప్రదర్శనలు ఇచ్చి నృత్యానికి వన్నె తెచ్చారు. ఆమె సాధనలపై రెండు డాక్యుమెంటరీలు సంచారి, ఫ్లవరింగ్ ట్రీ వచ్చాయి. సంస్కృతి, నృత్య చూడామణి, కలైమామని, సంగీత నాటక అకాడమీ అవార్డులు అందుకున్నారు.

గగన్ నారంగ్ (పుట్టినరోజు)



పద్మశ్రీ గ్రహీత హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రైఫిల్ షూటింగ్ క్రీడాకారుడు గగన్ నారంగ్ 1983 మే 6న చెన్నైలో జన్మించారు. 2006 కామన్వెల్త్ క్రీడలలో 4 బంగారు పతకాలను సాధించారు. రెండు వ్యక్తిగత పతకాలు కాగా మరో రెండు పెయిర్స్‌లో అభినవ్ బింద్రాతో కలసి సాధించారు. 2008 ఒలింపిక్స్ క్రీడలలో కూడా 3 ఈవెంట్‌లలో పాల్గొన్నా పతకం సాధించలేకపోయారు. అయితే 2012లో లండన్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సాధించి చరిత్ర లిఖించారు. రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న తదితర అవార్డులు అందుకున్నారు.

హావేరిలో బొమ్మై

గట్టెక్కేనా..?





- మాజీ సీఎంకు పరీక్షగా మారిన ఎన్నికలు
- కలిసిరాని స్థానిక నేతలు
- ఆనందస్వామికి బలంగా మారిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు



బసవరాజ్ బొమ్మై ఆనందస్వామి గడ్డదేవరమఠ

బెంగళూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): హావేరి రాజకీయం రోజుకో మలుపులు తిరుగుతోంది. అనూహ్యంగా తాజా మాజీ సీఎం బసవరాజ్‌బొమ్మై అదృష్ట పరీక్షకు లోక్‌సభ ఎన్నికలు వేదికయ్యాయి. గదగ్-హావేరి జిల్లాలకు అనుబంధమైన 8 శాసనసభ నియోజకవర్గాలతో హావేరి లోక్‌సభ పరిధిగా ఉంది. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రస్తుత ఎమ్మెల్యేగా కొనసాగుతున్న బసవరాజ్ బొమ్మై ఇక్కడ పోటీ చేయడంతో పరిస్థితి హై ఓల్టేజ్‌గా మారింది. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే జీఎస్ గడ్డదేవరమఠ కుమారుడు ఆనందస్వామి గడ్డదేవరమఠ పోటీలో ఉన్నారు. కర్ణాటక రాష్ట్ర సమితితోపాటు 14మంది అభ్యర్థులు బరిలో ఉన్నా ప్రధానమైన పోటీ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే ఉంది. సిట్టింగ్ ఎంపీ శివకుమార్ ఉదాసి రాజకీయాలకు గుడ్‌బై చెప్పడం, సీనియర్ నేత ఈశ్వరప్ప కుమారుడు కాంతేశ్‌ను పోటీ చేయించాలని జరిపిన ప్రయత్నాలు బెడిసికొట్టి అనూహ్యంగా బొమ్మై అభ్యర్థి అయ్యారు. శివకుమార్ ఉదాసి ఒకానొకదశలో ముఖ్యమంత్రి అవుతారనే ప్రచారం సాగింది. కానీ అనుకోకుండా బసవరాజ్ బొమ్మైకు అవకాశం దక్కింది. ప్రస్తుత ఎన్నికల్లో ఉదాసి వద్దన్నందుకే బొమ్మై బరిలో నిలిచారు.

- 1952లో ముంబై-కర్ణాటక పరిధికి చెందిన ఈ నియోజకవర్గం 1957లో విభజన తర్వాత ధారవాడ దక్షిణ లోక్‌సభ నియోజకవర్గంగా మారింది. 1962 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రాతినిథ్యం వహించారు. ఇప్పటివరకు 17సార్లు ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ 12, బీజేపీ 4, లోక్‌శక్తి ఒకసారి గెలుపొందింది. శివానందపాటిల్ (హావేరి), హెచ్‌కే పాటిల్ (గదగ్ జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరూ సీనియర్‌లు కావడం విశేషం. అయితే శివానంద పాటిల్ కుమార్తె సంయుక్త పాటిల్ బాగల్కోటె అభ్యర్థి కావడంతో ఆయన అక్కడే బిజీగా ఉన్నారు. దీంతో హెచ్‌కే పాటిల్ పూర్తిస్థాయిలో బాధ్యతలు కొనసాగిస్తున్నారు.

● 17.77 లక్షలమంది ఓటర్లు

హావేరి లోక్‌సభ పరిధిలో 17,77,877మంది ఓటర్లు కాగా 8,82,330మంది మహిళలు, 8,95,366మంది పురుషులు, 81మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీ నుంచి శివకుమార్ ఉదాసికి 6,87,660 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి బీఆర్ పాటిల్‌కు 5,42,778 ఓట్లు దక్కాయి. 1,40,882 ఓట్ల మెజారిటీతో ఉదాసి గెలుపొందారు.

● 8 అసెంబ్లీ నియోజకవర్గాలు



హావేరి పరిధిలో గదగ్ (కాంగ్రెస్), రోణ (కాంగ్రెస్), శిరహట్టి (బీజేపీ), హావేరి (కాంగ్రెస్), రాణిబెన్నూరు (కాంగ్రెస్), బ్యాడగి (కాంగ్రెస్), హిరేకరూరు (కాంగ్రెస్), హానగల్ (కాంగ్రెస్) ఎమ్మెల్యేలు ఉండడం అభ్యర్థి ఆనంద గడ్డదేవరమఠకు కలసి వస్తోంది. తొలిసారి గదగ్ జిల్లా వ్యక్తి అభ్యర్థి కావడంతో జిల్లావాసులు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కుమారుడిగా రాజకీయ అనుభవం ఉంది. సరళమైన వ్యక్తి అనే మంచి పేరుంది. మైనస్‌లలో లోక్‌సభ నియోజకవర్గ సమస్యల పట్ల అవగాహన లేకపోవడం, గదగ్ జిల్లా వీడితో హావేరి జిల్లా పరిధిలో కొత్తవారనే ముద్ర ఉండడం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం లేకపోవడం ఎదురుదెబ్బగా మారింది. ఇక బీజేపీ అభ్యర్థి బసవరాజ్ బొమ్మైకు ప్రధాని నరేంద్రమోదీ చరిష్మాతోపాటు యువ ఓటర్లు కలసి రావడం, కేంద్రంలోని పదేళ్ల పాలనలో ప్రగతి, ముఖ్యమంత్రిగా కొనసాగినవేళ హావేరి జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు కలసి వస్తున్నాయి. మైనస్‌లలో పార్టీ ముఖ్యులు, కార్యకర్తలలో అసంతృప్తి ఉంది. స్థానికులతో కలసి పనిచేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. సీఎంగా జిల్లాకు ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉన్నా ఆ స్థాయిలో పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారనే విమర్శ ఉంది.

పవన్ విజయం కోసం పవనసుతుడికి పూజలు



భూరగమాకలహళ్ళిలో అభిమానుల పూజలు

చింతామణి, మే 5: పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి భారీ మెజారిటీతో గెలుపొందాలని కోరుతూ అఖిల భారత చిరంజీవి యువత సంస్థాపక అధ్యక్షుడు రవణస్వామి నాయుడు నేతృత్వంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన జాతీయ కమిటీ సభ్యురాలు దారం అనిత మార్గదర్శకత్వంలో పట్టణ శివారులోని భూరగమాకలహళ్ళిలోని వీరాంజనేయస్వామికి విశేష పూజలు జరిపించారు. అఖిల కర్ణాటక చిరంజీవి యువ త జిల్లా కార్యదర్శి సీవీ నాగరాజ్ మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ భారీ విజయం సాధించాలని ఆ కాంక్షిస్తూ పూజలు చేయించామన్నారు. ఈ సందర్భంగా అభిమానులు గిడ్డు, రమేశ్, షాబుద్దీన్, జాలరి శ్రీనివాస్, విజేత్, నరేశ్‌బాబు, సునిల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో పంటనష్టం



నేలపాలైన కాకర తోట

బంగారపేట, మే 5: తాలూకా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా పలు పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది. నాలుగైదు నెలలుగా మండుతున్న ఎండలతో ప్రజలు సతమతమయ్యారు. ఆశించిన మేరకు వర్షాలు లేకపోవడంతో కరువు ఛాయలు నెలకొన్నాయి. ఇటువంటి తరుణంలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో కోతదశలో ఉన్న పలు పంటలకు నష్టం వాటిల్లింది. హూనకల్ దొడ్డి గ్రామానికి చెందిన మునిరాజు రెండున్నర ఎకరాలలో పండించిన సొరకాయ, కాకరకాయ తోట సంపూర్ణంగా నేలమట్టమైందని వాపోయారు. లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని విచారం వ్యక్తం చేశారు. వేసవిలోనూ అప్పులు చేసి పంటలసాగు చేశానని అయితే వేసవిలో కురిసిన తొలి వర్షం ఈదురుగాలులు, వడగండ్ల కారణంగా చాలాచోట్ల పంటలు దెబ్బతిన్నాయని పలువురు రైతులు వాపోయారు. అకాలవర్షాలతో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్రికెట్‌ను ప్రోత్సహించాలి



పోటీల ప్రారంభంలో క్రీడాకారులు, నిర్వాహకులు

శిడ్లఘట్ట, మే 5: యువతలో ఐకమత్యం పెంపొందించేలా అన్ని క్రీడలను మరింతగా ప్రోత్సహించాలని ప్రస్తుతం ఐపీఎల్ ట్రెండ్ కొనసాగుతోందని స్థానికంగా జరిగే క్రికెట్ పోటీలను కూడా అదే తరహాలో నిర్వహించి స్ఫూర్తి కలిగించాలని హోబళి పంచాయతీ మాజీ అధ్యక్షుడు టీవీ శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని బశెట్టిహళ్ళి హోబళి చిక్కతేకహళ్ళిలో ఫ్రెండ్స్ క్రికెట్ బృందం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. స్నేహపూరితంగా సాగే క్రికెట్ టోర్నీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామంలోని యువత అంతా ఇలా వారికి ఆసక్తికల్గిన క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించడం సంతోషించదగ్గ అంశమన్నారు. పోటీలను క్రీడాస్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని, గొడవపడరాదని యువతకు సూచించారు. గ్రామపంచాయతీ సభ్యుడు సీ వెంకటేశప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ధృడత్వం సాధ్యమన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు సీతారామప్ప, కే మంజునాథ్, పీ మంజునాథ్, ఈ మంజునాథ్, టీఎస్ ప్రదీప్‌కుమార్, కృష్ణప్ప, సీతప్ప, రవి, నాగేశ్, చిక్కతేకహళ్ళి శివకుమార్, ఫ్రెండ్స్ క్రికెట్‌క్లబ్ జట్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణోత్సవం



ద్రౌపదీ సమేత ధర్మరాయస్వామి

బంగారపేట, మే 5: తాలూకాలోని కామసముద్ర హోబళి చిక్కకళవంచి గ్రామంలో ద్రౌపదీ సమేత ధర్మరాయస్వామి కల్యాణోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ 36వ వార్షికోత్సవంలో భాగంగా ఏప్రిల్ 26న ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 14వరకు 18రోజులపాటు మహాభారతంలోని 18 పర్వాల పౌరాణిక హరికథలను ప్రతిరోజూ మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5వరకు కొనసాగనుంది. కాగా కృష్ణదేవరాయ నాటక కంపెనీ నుంచి బయలునాటకాలను ప్రదర్శించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ద్రౌపతాంబ కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలి వచ్చారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ, అన్నసంతర్పణ నిర్వహించారు. ప్రజల్లో భక్తిభావాలు పెంపొందించేలా పౌరాణిక నాటకాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ద్రౌపదీ సమేత ధర్మరాయస్వామి కల్యాణోత్సవం నేపథ్యంలో ఆలయాన్ని విద్యుద్దీపాలు,పుష్పాలతో అందంగా ముస్తాబు చేశారు. ఎటు చూసినా జాతర సంబరంతో భక్తుల హడావుడి నెలకొంది.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

చేళూరు, మే 5: చేళూరు తాలూకాలో నీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు చేపట్టాలని తహసీల్దార్ సూచించారు. ఆయా 12 గ్రామపంచాయతీ అధికారులు స్థానికంగా కార్యాచరణ సాగించాలని సూచించారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా అమలవుతున్న ఇంటింటికీ కొలాయిల పథకం సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కాగా పీడీఓ వెంకటాచలపతి మాట్లాడుతూ ఇటీవల ఎండవేడిమి అధికమైందని ఆరోగ్య రీత్యా మధ్యాహ్నం వేళల్లో ప్రజలు సాధ్యమైన మేరకు ఇళ్లకే పరిమితం కావడం సముచితమని సూచించారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో పట్టణంలో మధ్యాహ్నం వేళ దాదాపు నిర్మానుష్యం అనేలా రోడ్లు ఉన్నాయి.

ధారవాడ 'పేడా' దక్కేదెవరికో..?

- దింగాలేశ్వర స్వామి ప్రచారంతో బీజేపీ బెంబేలు
- మోదీపైనే ప్రహ్లాద్ జోషి ఆశలు
- 9 సార్లు విజయంతో కాంగ్రెస్ కంచుకోటగా పేరు..
- ఇక్కడ లింగాయత ఓటర్లే కీలకం





బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ధారవాడ పేడా (పాలకోవా)కు ప్రసిద్ధి. అయితే ఈ సారి ఎన్నికల్లో ఆ రుచులు ఎవరికి దక్కేనో అనేది ప్రశ్నార్థక మయ్యింది. ప్రస్తుత ఎన్నికల్లో సీనియర్, జూనియర్‌ల మధ్య సాగుతున్న పోటీ కులాల ప్రాబల్యం ఎవరికి వరించనుందో అనేది ఉత్కంఠగా మారింది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి ఇక్కడ పోటీ చేస్తుండడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. కేంద్రంలో ప్రధాని మోదీ గ్యారెంటీలు, రాష్ట్రంలో సిద్దరామయ్య గ్యారెంటీలే ప్రధాన అస్త్రాలుగా మారాయి. బీజేపీ అభ్యర్థి కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి వరుసగా నాలుగుసార్లు విజయం సాధిస్తూ వస్తున్నారు. ఐదోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. రాష్ట్రప్రభుత్వ గ్యారెంటీలు, అహింద మద్దతుపైనే ఆశలు పెట్టుకున్న వినోద్ అసోటి తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగారు. ఈమధ్యన శిరహట్టి ఫకీర దింగాలేశ్వర స్వామి నామినేషన్ వేయడం సంచలనమైంది. చివరిక్షణంలో ఆయన ఉపసంహరించుకున్నా ప్రహ్లాద్‌జోషికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం ఎదురుదెబ్బగా మారింది. పోటీలో 17మంది అభ్యర్థులు బరిలో ఉన్నా బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యనే ప్రధాన పోటీగా ఉంది.

- అభివద్ధికి సంబంధించి అనుకూల, వ్యతిరేక చర్చలకంటే బ్రాహ్మణ, లింగాయత, కురుబ, అహింద అనే సామాజికవర్గాల మద్దతు కుతూహలం అవుతోంది. ఇక్కడనుంచి ఐదుసార్లు గెలుపొందిన వారు ఎవరూ లేరు. ఇది ఓ రికార్డు కాగా అసోటి గెలుపొందితే వరుసగా 7సార్లు గెలిచిన బీజేపీకి ఎదురుదెబ్బ పడినట్టు అవుతుంది. ధారవాడ జిల్లా ఉత్తర నుంచి పునర్విభజన జరిగాక హుబ్బళ్ళి - ధారవాడ నియోజకవర్గంగా ఏర్పడింది. 1952 నుంచి 2014వరకు జరిగిన ఎన్నికల్లో కేవలం ఐదుగురు మాత్రమే ఎంపీలుగా ఇక్కడనుంచి ప్రాతినిథ్యం వహించారు. వీరిలో ముగ్గురు బ్రాహ్మణులు కాగా ఒకరు లింగాయత, మరొకరు కురుబ సామాజికవర్గానికి చెందినవారు. స్వాతంత్ర్యానంతరం 17సార్లు జరిగిన ఎన్నికల్లో 9సార్లు కాంగ్రెస్ గెలుపు ద్వారా కంచుకోటగా కొనసాగింది. 1996 నుంచి వరుసగా 7సార్లు బీజేపీ అభ్యర్థులు గెలుపొందుతూ వస్తున్నారు. ప్రహ్లాద్‌జోషి బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవారైనా ఇదే ప్రాంతానికి చెందిన జగదీశ్ శెట్టర్ లింగాయత సామాజికవర్గం అనుకూలంగా ఉండడంతో జోషి గెలుపు సునాయాసంగా సాగింది. శెట్టర్ ముఖ్యమంత్రిగా పలుశాఖల మంత్రిగా, ప్రతిపక్షనేతగా వ్యవహరించిన అనుభవం ఉంది. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన బెళగావి నుంచి పోటీ చేస్తుండడంతో హుబ్బళ్ళి-ధారవాడవైపు సమయం కేటాయించలేకపోతున్నారు. హుబ్బళ్ళి ధారవాడ ప్రాంతాలు హిందూత్వకు అనుకూలంగా ఉండడంతో బీజేపీకి కలసివస్తోంది. అయితే ఈ నియోజకవర్గ పరిధిలోని కళసా-బండూరి ప్రాజెక్టు పనులకు కేంద్రం నుంచి అనుమతులు సాధించడంలో జోషి విఫలమయ్యారనే చెడ్డ పేరుంది.
- నియోజకవర్గంలో 5.5లక్షలమందికిపైగా లింగాయత సామాజికవర్గానికి చెందినవారు ఉండడం, ఇదే అస్త్రంగా దింగాలేశ్వరస్వామి బీజేపీ అభ్యర్థి జోషికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం కాస్త ఎదురుదెబ్బగా మారింది.
- ప్రహ్లాద్‌జోషికి 4సార్లు గెలిచిన అనుభవం, కేంద్రంలో కీలకమైన పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రిగా వ్యవహరించిన చరిత్ర ఉంది. ప్రజలతో సంబంధాలు నిరంతరంగా పొంది ఉండడం కలసి వస్తోంది. జోషికి మైనస్‌లలో దింగాలేశ్వరస్వామి వ్యతిరేకంగా ప్రచారం చేయడం, మైత్రి పార్టీ జేడీఎస్‌కు తగిన బలం లేకపోవడం, మాజీ సీఎం జగదీశ్‌శెట్టర్, బసవరాజ్ బొమ్మైలు అభ్యర్థులుగా మారి వెంట లేకపోవడం ఇబ్బందికరమవుతోంది. ఇక కాంగ్రెస్ అభ్యర్థి వినోద్ అసోటికి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలతోపాటు మంత్రి సంతోష్‌లాండ్ మరో నలుగురు ఎమ్మెల్యేల మద్దతు ఉంది. యువ నాయకుడనే అభిమానం కలిగి ఉన్నారు. మైనస్‌లలో లోక్‌సభ ఎన్నికలకు కొత్తవారు అనే పేరుతోపాటు పార్టీ నాయకులలో సమన్వయం లేకపోవడం, ప్రచారంలో ఎక్కువగా హైలెట్ కాకపోవడం కొరతగా ఉంది.

18.31లక్షల మంది ఓటర్లు



- ధారవాడ పరిధిలో ధారవాడ గ్రామీణ (కాంగ్రెస్), హుబ్బళ్ళి - ధారవాడ పశ్చిమ (బీజేపీ), హుబ్బళ్ళి - ధారవాడ సెంట్రల్ (బీజేపీ), హుబ్బళ్ళి - ధారవాడ తూర్పు (కాంగ్రెస్), కుందగోళ (బీజేపీ), కలఘటగి (కాంగ్రెస్), నవలగుంద (కాంగ్రెస్), శిగ్గావి (బీజేపీ) ఎమ్మెల్యేలు ఉన్నారు. నియోజకవర్గంలో 18,31,975 మంది ఓటర్లు ఉండగా 9,13,949 మంది మహిళలు, 9,17,926మంది పురుషులు, 100మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ప్రహ్లాద్‌జోషి 6,84,837 ఓట్లు పొందగా కాంగ్రెస్ అభ్యర్థి వినయ్ కులకర్ణి 4,79,765 ఓట్లు పొందారు. 2,05,072 ఓట్ల మెజారిటీతో జోషి గెలుపొందారు.

కలుషిత కేక్ తిని చిన్నారులకు అస్వస్థత

బాగేపల్లి, మే 5: బర్త్‌డే కేక్‌ను తిని చిన్నారుల అస్వస్థతకు కారణమైన కేక్ పాయింట్ బేకరీ నిర్వాహకులపై తాలూకా ఆరోగ్య అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించారు. పట్టణంలోని పదో వార్డులో గూళూరు సర్కిల్‌లో కేక్‌పాయింట్ బేకరీ ఉంది. బూజు పట్టిన బర్త్‌డే కేక్‌ను శుక్రవారం రాత్రి విక్రయించారని, గమనించక తిన్న చిన్నారులు అస్వస్థతకు గురయ్యారనే ఫిర్యాదు వచ్చింది. పురసభ సభ్యుడు గడ్డం రమేశ్ స్వయంగా ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ సీఎన్ సత్యనారాయణరెడ్డి పోలీసులతో కలసి బేకరీని పరిశీలించారు. స్వచ్ఛత, తినుబండారాల నాణ్యతను పరిశీలిచారు. స్వచ్ఛత పాటించకపోవడం, గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయించారనే కారణంపై నోటీసు ఇచ్చారు. చిన్నారుల అస్వస్థతకు కారణమైన కేక్‌ను బెంగళూరు ఐడీఎఫ్ఏటీ అనే ప్రైవేట్ పరీక్షా కేంద్రానికి పంపారు. నివేదిక వచ్చిన అనంతరం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా శుక్రవారం రాత్రి బర్త్‌డే కేక్‌ను కొనుగోలు చేసి తీసుకెళ్లారు. కేక్ తిన్న కొద్దిసేపటికే చిన్నారులు అస్వస్థతకు గురి కావడంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కారణాన్ని ఆరా తీయగా కేక్ బూజు పట్టి ఉండడమే అని గుర్తించి ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు.




బేకరీలో అధికారుల తనిఖీలు

తాగునీటి కోసం నిరసన



పురసభ కార్యాలయంలో నిరసనలో వార్డు వాసులు

బాగేపల్లి, మే 5: బాగేపల్లి పట్టణంలోని ఒకటో వార్డులో ఆరు నెలలుగా నీటి సమస్య ఉందని, శ్రీమంతులకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తూ సామాన్య ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. పురసభ కార్యాలయం వద్ద ఆదివారం వార్డు వాసులు నిరసన చేపట్టారు. ఒకటో వార్డు పట్ల అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యాన్ని తప్పుబట్టారు. ఇప్పటికే ఒకసారి నీటి సమస్యపై ధర్నా చేపట్టినా స్పందన లేకపోవడంతో మరోసారి నిరసన చేపట్టామని స్థానికులు ఆక్రోశం వ్యక్తం చేశారు. పురసభ ముఖ్య అధికారి జోక్యంతో వార్డు వాసులు శాంతించి నిరసన వీడారు. వార్డు వాసి వెంకటరెడ్డి మాట్లాడుతూ నీటి సమస్యపై ఆరు నెలలక్రితం ఫిర్యాదు చేయగా అప్పట్లో ప్యానెల్‌బోర్డ్, పైప్‌లైన్‌కు మరమ్మత్తులు చేసి ఫోటోలు తీసుకెళ్లారని అయితే పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుతం ఒక ట్యాంకరు నీరు రూ.400-500 ధర ఉందని, కూలి పనులు చేసి జీవనం సాగించే సామాన్యులు ఇంత మొత్తాన్ని ఎలా భరిస్తారన్నారు. వార్డులో ఉన్న కొంతమంది ప్రభావితులకు మాత్రం ట్యాంకర్ల ద్వారా నీటిని సమకూర్చి సామాన్యులను విస్మరించారన్నారు. నిరసనలో వార్డుకు చెందిన పెయింటర్ నారాయణ, నాగరాజ, సురేశ్, నంజుండ, ఆదిలక్ష్మమ్మ, శోభా, సౌమ్య, నాగమణి, అమరమ్మ, రత్నమ్మ, రవణమ్మ, నారాయణమ్మ, కోమల తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.89	1,575.60
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	138	196
సామర్థ్యం (టీఎంసీలు)	3.53	2.69

మోదీ హయాంలోనే ఉగ్రవాద నియంత్రణ



మాట్లాడుతున్న మాజీ సీఎం సదానంద గౌడ

బళ్లారి సిటీ, మే 5: మోదీ దేశానికి ప్రధాని అయిన తరువాత దేశంలో ఉగ్రవాదం, నక్సలిజం పూర్తిగా అదుపులోకి వచ్చాయని మాజీ సీఎం సదానంద గౌడ అన్నారు. దేశం ఆర్థికంగా కూడా బలపడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ ఎన్నికలు దేశాన్ని తార్కిక ముగింపునకు తీసుకెళ్లే ఎన్నికలని అన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా శ్రీరామ మందిరం సహా అన్నింటినీ బీజేపీ నెరవేర్చిందన్నారు. మోదీ క్యాబినెట్‌లోని ఏ మంత్రికి నల్లమచ్చ లేదన్నారు. సిద్దరామయ్య, డీకే శివకుమార్.. మోదీని కించపరచడం తప్ప ఏమీ మాట్లాడడం లేదన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లాధ్యక్షుడు అనిల్ కుమార్ మోకా,మాజీ అధ్యక్షుడు మురహర్‌గౌడ, గుత్తినూర్ విరూపాక్షగౌడ, హనుమంతప్ప, వీరశేఖర్‌రెడ్డి, దమ్మూరు శేఖర్, మహేశ్వర్ స్వామి, డాక్టర్ బి.కే.సుందర్, రాఘవేంద్ర, జనార్దన,మల్లేశ్, రాజీవ్ తొగరి తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న దివాకర్‌బాబు

బళ్లారి సిటీ, మే 5: గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏ పార్టీ కార్యక్రమంలోనూ కనిపించని మాజీ మంత్రి దివాకర్‌బాబు ఈసారి లోక్‌సభ ఎన్నికలలో చివరి రోజు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ అభ్యర్థి తుకారాంకు ఓటు వేయాలంటూ దుర్గమ్మ గుడి దగ్గర సైకిల్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. గత 10 ఏళ్లలో ధనికులకు అనుకూలంగా పాలించిన బీజేపీని ధిక్కరించి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ఈసందర్భంగా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తేజస్‌కుమార్,గౌతం, అబ్దుల్, బుజ్జి, హమాలి వీరేశ్, దేవినగర్ సత్య, రామాంజిని, దారం మిల్ శేఖర్, సురేశ్ పులువురు పాల్గొన్నారు.

గర్భిణులు పరీక్షలు చేయించుకోవాలి



గర్భిణి కార్డును పరిశీలిస్తున్న డీహెచ్‌ఓ

బళ్లారి సిటీ, మే 5: గర్భవతులు సహజ ప్రసవ నొప్పులతోపాటు ఎలాంటి నొప్పులు వచ్చినా సమీపంలోని ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వైద్యుల సలహాలు తీసుకోవాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశా అధికారి రమేశ్‌బాబు తెలిపారు. ఆదివారం ఎమ్మిగనూర్ గ్రామంలో క్షేత్రస్థాయి పనుల్లో భాగంగా ఓ నిండు గర్భిణీ ఇంటిని సందర్శించి తల్లికార్డు, తూకం, శరీరంలోని రక్తం తదితర వివరాలను పరిశీలించి మాట్లాడారు. తల్లి గర్భం దాల్చినట్లు తెలిసిన రోజు నుంచి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని , శరీరంలోని రక్తం, బరువు, రక్తపోటు, హెచ్‌ఐవీ తదితర వాటిని బట్టి ఐరన్ మాత్రలు వేసుకుని మరణాన్ని నివారించాలని సూచించారు. ప్రసవం ఆసుపత్రిలోనే జరగాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్ననేపథ్యంలో గర్భిణులు మరింత పౌష్టికాహారం తీసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీలైనంత ఎక్కువ నీరు తాగించాలని కుటుంబ సభ్యులకు చెప్పారు.

ఇక అంతా గప్‌చుప్!

- ముగిసిన ప్రచారం
- రాత్రిపూట ఇంటింటి ప్రచారం షురూ
- తాయిలాల పంపిణీకి చర్యలు
- హోటళ్లను ఖాళీ చేయిస్తున్న పోలీసులు



బళ్లారి, మే 5(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల బహిరంగ ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఈనెల 7న ఓటింగ్ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ, ఎస్‌యూసీఐ, ఇతర ఇండిపెండెంట్లు ఆదివారం వరకూ ప్రచారం సాగించారు. కాంగ్రెస్, బీజేపీ ప్రచారంలో నువ్వా నేనా అనే రీతిలో వ్యవహరించాయి. ప్రధాన పార్టీలు వాహనాల్లో ప్రత్యేకంగా ప్రచారం చేస్తే మరికొన్ని పార్టీలు ఆటోల్లో మైకులు కట్టి ఊరూరా ప్రచారం నిర్వహించాయి. ఆదివారం సాయంత్రంతో బహిరంగ ప్రచారానికి తెరపడడంతో ఇక రాత్రి పూట ఇంటింటి ప్రచారానికి అభ్యర్థులు తెరలేపారు. అలాగే ఓటర్లకు తాయిలాలు ఇతర వస్తువులు ఇచ్చి ఓటర్లను రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బళ్లారి జిల్లాలోని మొత్తం 8 అసెంబ్లీ నియోజక వర్గాల్లో 18లక్షల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. ఓటింగ్‌కు రెండు రోజులే గడువు ఉండడంతో అభ్యర్థులు రాత్రి పూట ప్రధాన స్థావరాల్లో తిరగడం, మతపెద్దలను, కులపెద్దలను కలవడం చేస్తున్నారు. ఇక డబ్బులు పంపకాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. కొత్తవారు ఎవరూ లాడ్జిల్లోనూ అలాగే ఇతర హోటళ్లలో లేకుండా పోలీసులు ఖాళీ చేయిస్తున్నారు. ప్రధానంగా కొత్తగా ఇక్కడికి ప్రచారానికి వచ్చిన నాయకులు ఎవరూ ఇక ప్రచారంలో తిరగరాదని, అలాగే ఓటరు కాని వ్యక్తులు ఎవరూ ఉండరాదని పోలీసులు హెచ్చరిక జారీ చేశారు. ఎవరైనా అనుమానం వ్యక్తులు కనిపిస్తే అదుపులోకి తీసుకుంటామని పోలీసులు హెచ్చరిక జారీ చేశారు. బహిరంగ ప్రచారం ముగియడంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రాజకీయ పార్టీల నాయకులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి భార్య భాగ్యలక్ష్మి పర్యటన

బళ్లారిరూరల్, మే 5 : తాలుకాలోని మోకా, జాలేహాళ్ తదితర గ్రామాల్లో తన భర్త బీజేపీ అభ్యర్థి శ్రీరాములు తరఫున ఆయన భార్య భాగ్యలక్ష్మీ ఆదివారం ప్రచారం చేశారు. ఆయన పోటీచేస్తున్న బీజేపీ కమలం గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారంలో ఓటర్లను కోరారు. అదేవిధంగా గతంలో తన భర్త బళ్లారి నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశాడని, మరోసారి అవకాశం ఇస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాడని ఆమె పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో నరేంద్రమోదీ కూడా దేశాన్ని ఎంతో అభివృద్ధి చేశారని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మరెన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. బీజేపీని గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని కావున కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాలేహాల్ గ్రామ పంచాయతీ అధ్యక్షులు జై శంకర్ గౌడ, కానూను సలహాదారుడు కే గవిసిద్దప్ప, ఉమాపతి గౌడ, రుద్రగౌడ, హనుమంతరెడ్డి, పరశురామ్, వన్నూరప్ప, నాగరాజ, సోమప్ప, తదితర బీజేపీ కార్యకర్తలు, గ్రామస్తులు ఆమె వెంట ప్రచారంలో పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో బీజేపీ అభ్యర్థి శ్రీరాములు భార్య భాగ్యలక్ష్మి

బీజేపీ అభ్యర్థి గెలుపుకోసం మీనళ్లి తాయణ్ణ ప్రచారం



శ్రీరాములు గెలుపుకోసం ప్రచారం చేస్తున్న జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ

బళ్లారిరూరల్, మే 5: తాలుకాలోని మించేరి, సంజీవరాయుని కోట, శంకరబండ, కమ్మర చేడు, ఎత్తిన బూదేహాళ్ తదితర గ్రామాలలో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి శ్రీరాములు గెలుపు కోసం జేడీఎస్ జిల్లా అధ్యక్షులు మీనళ్లి తాయణ్ణ విస్తృత ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధాని మంత్రి కావడంతో దేశం సస్యశ్యామలంగా వుంటుందని పలు గ్రామాల ప్రజలకు, ఓటర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేడీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, మాజీ మహానగర పాలిక సభ్యులు కృష్ణ, వంద్రి, మల్లన్నగౌడ, చాగనూరు నాగరాజు, మీనళ్లి రామాంజిని, బసప్ప, బీజేపీ ప్రముఖులు సోమశేఖర్ గౌడ, పలు గ్రామాల బీజేపీ, జేడీఎస్ నాయకులు పాల్గొన్నారు.

అవగాహనతో ఓటేయాలి

జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, మే 5: ప్రతి ఓటు అమూల్యమైనదని, పొరపాటు లేకుండా వేయాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా పిలుపునిచ్చారు. నగరంలోని హెచ్‌ఆర్ గవియప్ప (మోతి) సర్కిల్లో శనివారం రాత్రి జిల్లా స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో ఓటింగ్ అవగాహనలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఓటు విలువను గ్రహించి ప్రతి ఒక్కరూ నిష్ఠతో ఓటు వేయాలన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటింగ్ ప్రక్రియ గురించి ఇరుగుపొరుగు వారికి తెలియజేయాలన్నారు. జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప అధ్యక్షత వహించి మాట్లాడుతూ జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషిచేయాలన్నారు. పోలింగ్ బూత్‌లకు వచ్చే ఓటర్లకు మెరుగైన అనుభూతిని కలిగించేందుకు ప్రత్యేక పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసి అన్ని రకాల సన్నాహాలు చేశామన్నారు. అదేవిధంగా వికలాంగుల ఓటు వేసెందుకు ర్యాంపులు, వీల్‌చైర్లు, ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, స్వీప్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ఓటరు చైతన్యం కోసం నిష్ఠగా పనిచేస్తున్నారని కొనియాడారు. జిల్లా స్వీప్ ఐకాన్ ఎస్‌కేఆర్ జిలాన్‌భాషా మాట్లాడుతూ పోలింగ్ రోజున సెలవు ఉన్నందున ప్రతిఒక్కరూ మొబైల్ ఫోన్లపై ఆధారపడకుండా పోలింగ్ బూత్‌లకు వెళ్లి తమ అమూల్యమైన ఓటు వేసే కర్తవ్యాన్ని నిర్వర్తించాలని సూచించారు.

-కళ్లను కట్టిపడేసిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఓటింగ్ అవగాహనలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో భరతనాట్యంతో పాటు బహిరంగ ప్రదర్శనలు జానపద గేయాలు, బృందనృత్యాలు, ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా అటవీ శాఖ డిప్యూటీ కన్జర్వేటర్ సందీప్ సూర్యవంశీ, మున్సిపల్ కార్పోరేటర్ కమిషనర్ ఖలీల్‌సాబ్, జిల్లాపంచాయితీ ముఖ్యప్రణాళిక అధికారి వాగేశ్ శివాచార్యక న్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజ్ వివిధ శాఖల అధికారుల సిబ్బంది పాల్గొన్నారు.



నృత్యం ద్వారా ఓటుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


కొత్తగా 750 ఈవీఎంల ఏర్పాటు



మరమ్మతులకు లోనైన ఈవీఎం

బళ్లారి, మే 5(ఆంధ్రజ్యోతి): బళ్లారి లోక్‌సభ కేంద్రానికి కొత్తగా 750 ఈవీఎంలు వచ్చినట్లు ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. బళ్లారి స్థానంలో ఓటింగ్‌కు వినియోగించే ఈవీఎంలను అధికారులు పరిశీలించి వీటిలో 750 ఈవీఎంలలో సాంకేతిక లోపం ఉండడాన్ని గుర్తించారు. మొత్తం 3111 ఈవీఎంలను పరిశీలించగా వీటిలో 750 ఈవీఎంలకు బటన్ ప్రెసింగ్ లో లోపం కనిపించిందని తెలిపారు. దీంతో వీటి స్థానంలో కొత్త ఈవీఎంలు తెప్పించినట్లు తెలిపారు. చెడిపోయిన ఈవీఎంలు ఇంతకు ముందు బెలగాం నుండి ఎన్నికల అధికారులు సరఫరా చేసినట్లు తెలిపారు. బళ్లారి లోక్‌సభ స్థానంలో 1972 పోలింగ్ బూత్‌లు ఉండగా అన్నిచోట్ల ఓటర్లకు సరిపడే ఈవీఎంలను సమకూర్చినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

జాతీయ జెండాకు అవమానమా?



మాట్లాడుతున్న గంగిరెడ్డి

బళ్లారి సిటీ, మే 5: జాతీయ జెండాను అవమానపరిచిన శ్రీరాములుపై చర్యలు తీసుకోవాలని జనగణమన యూనియన్ వ్యవస్థాపకుడు గంగిరెడ్డి అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022లో కర్ణాటక ప్రభుత్వ మంత్రి వాహనంపై దేశ జెండా ఉన్నా పట్టించుకోకుండా కారుపైకి ఎక్కి ప్రచారం చేసి 140 కోట్ల మంది మనోభావాలను దెబ్బతీశారన్నారు. బీజేపీ నేత బి.శ్రీరాములుపై సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పాలిక మాజీ సభ్యుడు ఎన్.గంగిరెడ్డి డిమాండ్ చేశారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను, ఐటీ ఈడీని, సీబీఐని స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్ష పార్టీల నేతలను అణిచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఎవరూ ఓటు వేయకుండా ఓడించి ఇంటికి పంపాలన్నారు. జాతీయ జెండాను అవమానించిన కేసులో మాజీ మంత్రి శ్రీరాములుపై చట్టపరమైన చర్యలు తీసుకుని పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

కళ్యాణ్ జ్యువెలర్స్ పేలుడు ఘటనలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు : ఎస్పీ

బళ్లారి గాంధీనగర్, మే 5: నగరంలో కళ్యాణ్ జువలరీ షాప్‌లో గురువారం జరిగిన ఏసి పేలిన ఘటనకు సంబంధించి షోసియల్ మీడియాలో కొంతమంది ఉద్రేకపూరితమైన పోస్టులు చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా పోలీసు విభాగం హెచ్చరించింది. ఘటనలో గాయపడిన అహ్మద్ బాషా, సైయ్యద్ తబ్రేజ్ బాషా, సైయ్యద్ జుబేర్ అను ముగ్గురు వ్యక్తులు ఏసికి గ్యాస్ నింపుతున్న సమయంలో పేలుడు సంభవించిందని, వీరితో పాటు షాపులో పనిచేస్తున్న సిబ్బంది అరుణ్, నింగప్పలు గాయపడ్డారని తెలిపారు. వీరిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘటనలకు సంబంధించి సోషియల్ మీడియాలో కొంతమంది వ్యక్తులు ఉద్రేకపూరితమైన పోస్టులు వేస్తూ ఇది భయోత్పాదక చర్యగా వర్ణిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ తెలిపారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకుందాం



ముద్దాపురం శాంతిసభలో మాట్లాడుతున్న శివరాజ్, సీఐ ప్రకాష్

కంప్లి, మే 5 : లోక్‌సభ ఎన్నికల్లో ఘర్షణలు తలెత్తకుండా ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ ముందుకురావాలని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. తాలూకా పరిధిలోని నెంబర్ 2 ముద్దాపురం గ్రామంలో శుక్రవారం శాంతిసభ నిర్వహించారు. ఇక్కడ గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఘర్షణలు జరిగిన విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో ఘర్షణలకు దిగితే చర్యలు తప్పవని సూచించారు. ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. అనంతరం సీఐ ప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎవరూ ఘర్షణలు పడినా వారిపై కేసులు నమోదు చేసి ముమ్ముందు రాబోయే ఎన్నికల్లో కూడా వారు గ్రామానికి దూరంగా వుండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్ కార్పొరేటర్ మించు శ్రీనివాస్ ప్రచారం

బళ్లారిరూరల్, మే 5: బళ్లారి నగరంలో 35వ వార్డు కరిమారెమ్మ కాలనీలోను, ఇతర వీధులలో ఆ వార్డు కార్పొరేటర్ మించు శ్రీనివాస్ కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి తుకారామ్ గెలుపు కోసం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఐదు గ్యారెంటీల వల్ల ప్రజలు సంతోషంగా వున్నారని, ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ఈతకెళ్లి యువకుడి మృతి

రాయచూరు, మే 5 : జిల్లాలోని లింగసుగూరు తాలూకా కోట గ్రామ సమీపంలో ఆదివారం ఎన్ఆర్‌బీసీ 9ఏ కాల్వలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. స్నేహితులతో కలిసి ఆదివారం ఈత కోసం వెళ్లిన 17 ఏళ్ల అయాన్ శఫీ ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న ముదగల్ అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని యువకుడి శవాన్ని బయటికి తీశారు. హట్టి పోలీసులు కేసు నమోదు చేశారు.

హోసూరు జోన్

కొండపైకి పాతరథం తరలింపు



పాత రథం తరలింపులో పాల్గొన్న మనోహరన్ తదితరులు

హోసూరు, మే 5: హోసూరు శ్రీ చంద్రచూడేశ్వర ఆలయంలో అమ్మవారికి కొత్త రథం నిర్మాణం పూర్తయిన తర్వాత మార్చి 25న రథోత్సవం నిర్వహించారు. ఫలితంగా పాత రథాన్ని కమిటీ ఛైర్మన్ మనోహరన్ ఆధ్వర్యంలో ప్రజల సందర్శనార్థం ప్రసిద్ధ చంద్రచూడేశ్వర కొండ మీదకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేసి అక్కడే ఉంచారు. మరగతాంబిక రథం గత కొన్ని నెలలుగా శిథిలావస్థకు చేరుకోవడంతో అమ్మవారికి కొత్త రథం తయారు చేసే పనులు చేపట్టారు. జనవరి 24న కొత్త రథం ట్రయల్ చేసి తదనంతరం మార్చి 25న రథోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిటీ ఛైర్మెన్ మనోహరన్ మాట్లాడుతూ మరగతాంబిక రథం శిథిలావస్థకు చేరుకుపోవడంతో కొత్త రథాన్ని నిర్మించామన్నారు. ఈ రథం 14 అడుగుల వెడల్పు, 14 అడుగుల ఎత్తుతో భూతకానాలు, యాజీ, తాళ చరిత్ర శిల్పాలు, గుర్రం ఏనుగు మొదలైన వాటితో అలంకరించబడి ఉంటుంది. తిరువారూర్ ఆచారి నేతృత్వంలో బృందం దీన్ని తయారు చేసింది. సుమారు రూ.3.69 లక్షలతో నూతన రథాన్ని తయారు చేశారన్నారు. సుదీర్ఘకాలం సేవలందించిన రథానికి గౌరవప్రదంగా పూజలు చేసినట్టు తెలిపారు.

ఘనంగా ఏళుమలైస్వామి జయంతి

హోసూరు, మే 5: హోసూరు మోర్నపల్లి గ్రామంలో మహా ప్రత్యంగిరా దేవి ఆలయ వ్యవస్థాపకులు, ప్రధాన అర్చకులు సప్తగిరి అమ్మగా పిలిచే ఏళుమలై స్వామి జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కుటుంబ సభ్యులు, భక్తులు ప్రతి సంవత్సరం ఏళుమలై స్వామి జయంతిని నిర్వహిస్తుంటారు. ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్ది పుష్పాలతో అలంకరించారు. ఆయన తన జీవితకాలమంతా ప్రత్యంగిరాదేవి సేవలో కొనసాగారు. ఏళుమలైస్వామి అనంతరం దేవాలయ పూజలను కొనసాగిస్తూ ఉన్నామని అతని కుమారుడు తెలిపారు. పౌర్ణమి, అమావాస్యల రోజుల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తుంటారు.



ఏళుమలైస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నీటి ఎద్దడిని పరిష్కరించాలి

హోసూరు, మే 5: హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కామరాజనగర్, కేసీసీ నగర్ తదితర ప్రాంతాల్లో రెండు నెలలుగా నీటి ఎద్దడి నెలకొంది. ఈ ప్రాంతాల్లో అనేక చిన్న తరహా పరిశ్రమలు నడుస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ ప్రాంతానికి కావేరి ఉమ్మడి తాగునీరు సరఫరా కాలేదు. వేసవి ఆరంభం నుంచే బోర్లలో నీరు అడుగంటింది. దీనిపై పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. కొన్ని రోజులుగా 5 వేల లీటర్ల సామర్థ్యం ఒక ట్యాంకరు ఇదివరకు రూ.600 ధర ఉండగా ప్రస్తుతం రూ.800 నుంచి వెయ్యి రూపాయల వరకు ఉంది. నిత్యావసరాల ధరలతోపాటు మరోవైపు నీటి సమస్య నెలకొనడం, ప్రైవేట్ ట్యాంకర్ల ధరలు సైతం పెరగడంతో స్థానికులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. నీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని కామరాజనగర్, కేసీసీ నగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

రాయచూరు డీసీ చంద్రశేఖర్ నాయక్




మాట్లాడుతున్న డీసీ చంద్రశేఖర్ నాయక్

రాయచూరు, మే 5 : ఈనెల 7వ తేదీన జరగనున్న లోకసభ ఎన్నికల పోలీంగ్ కోసం రాయచూరు లోకసభ నియోజక వర్గం పరిధిలోని అన్ని పోలీంగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. ఆదివారం జిల్లాధికారి కార్యాలయం వద్ద వీడియోకాన్ఫరేన్స్ హాల్‌లో విలేఖరులతో మాట్లాడిన జిల్లాధికారి ఎన్నికలు పారదర్శకంగా శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. రాయచూరు ఎస్టీ లోకసభ నియోజక వర్గ పరిధిలో మొత్తం 20,10,437 మంది ఓటర్లుండగా 2203 పోలీంగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధుల కోసం 8464 మంది అధికారులను, సిబ్బందిని నియమించామని జిల్లాధికారి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల పోలీంగ్ ఈ నెల 7వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిబంధనల మేరకు ఎన్నికల ప్రచారాన్ని 5వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటల్లోగా ముగించాల్సి ఉంటుందని ఇప్పటికే అభ్యర్థులకు స్పష్టం చేశామన్నారు. రాయచూరు లోకసభ నియోజక వర్గం పరిధిలో మొత్తం 87 మంది అభ్యర్థులుండగా పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. నియోజక వర్గంలో 9,94,646 మంది పురుషులుండగా 10,15,158 మంది మహిళా ఓటర్లు ఉన్నారని 299 మంది ఇతరులు, అత్యవసర సేవల్లో ఉన్నవారు 334 మంది ఉన్నట్లు తెలిపారు. సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్త్ ఏర్పాటు చేశామని ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిరకాల ఏర్పాట్లు చేశామన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపద్యంలో వైద్య సిబ్బందిని ప్రతి పోలింగ్ బూత్ వద్ద అందుబాటులో ఉంచామన్నారు. వికలాంగులు, వృద్దులకు ఇబ్బంది లేకుండా అన్ని కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేశామని వీల్ ఛైర్‌లను అందుబాటులో ఉంచామన్నారు. ప్రజల నుంచి 1950 సీ విజిల్ యాప్ ద్వారా 621 ఫిర్యాదులు రాగా.. వాటిలో రాయచూరు జిల్లాకు సంబంధించి 321 కేసులు, యాదగిరి నుంచి 300 కేసులు ఉన్నాయన్నారు.

మూగబోయిన మైకులు

రాయచూరు, మే 5 : గడచిన 8 రోజులుగా సాగిన లోకసభ ఎన్నికల ప్రచారానికి ఆదివారంతో తెరపడింది. ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనల మేరకు పోలింగుకు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాల్సి ఉండగా బహిరంగ ప్రచారాన్ని ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి అన్ని పార్టీల వారు ముగించారు. దీంతో నగరంలో గత 8 రోజులుగా వినిపించిన మైకుల హోరు వాహనాల జోరు మూగబోయింది. కార్యకర్తల ఎక్కడికక్కడ తమ ప్రచారాన్ని నిలిపివేయగా నేటి నుంచి అభ్యర్థులు వారి తరఫున మద్దతుదారులు ఇంటింటి ప్రచారానికి ముఖ్యంగా ఓటర్లను వ్యక్తిగతంగా కలిసేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు.



నడ్డాపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

బెంగళూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ సోషల్‌మీడియా ఇన్‌చార్జ్ అమిల్ మాళవీయ, కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు విజయేంద్రలపై ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఫిర్యాదు చేసింది. సీఎం సిద్దరామయ్య, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీలను హేళన చేసేలా ఓవీడియోలో ప్రచారం చేశారని ఆరోపించారు. బీజేపీ కర్ణాటక షేర్ చేసిన వీడియోలో ఎస్సీ, ఎస్టీ వర్గాలు నిర్దిష్టమైన అభ్యర్థికి ఓటు వేయరాదని బెదిరించేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందనేలా ఓ యానిమేటెడ్ వీడియోను శనివారం పోస్ట్ చేశారు. దీనిపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి రమేశ్‌బాసీ ఈసీకి ఫిర్యాదు చేశారు.

విపొత్తు..!

- బీజేపీ-జేడీఎస్ పొత్తుకు పెన్‌డ్రైవ్ బీటలు ..!
- ఒంటరిగానే.. పరిషత్ పోరుకు..!
- ప్రజ్వల్ వివాదంతో నష్టం తప్పదంటున్న బీజేపీ నేతలు
- అయోమయంలో జేడీఎస్ ఎమ్మెల్యేలు
- ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కీలక మార్పులు తప్పవా..?





బెంగళూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజ్వల్ రాసలీలల వ్యవహారంతో బీజేపీ, జేడీఎస్ పొత్తుకు బీటలు వారేలా ఉంది. జేడీఎస్‌తో కలిసి నడిస్తే మునిగిపోక తప్పదని పలువురు బీజేపీ నాయకులు ఆలోచనల్లో పడ్డారు. రాష్ట్ర రాజకీయాల్లో చారిత్రాత్మకం అనిపించేలా బీజేపీ-జేడీఎస్‌ల పొత్తు కుదిరింది. లోక్‌సభ ఎన్నికల్లో కలసి పోటీ చేయాలని నిర్ణయించారు. ఈ మైత్రి లోక్‌సభకే పరిమితం కాకుండా భవిష్యత్తులోనూ కొనసాగిద్దామని ఇరుపార్టీల అగ్రనేతలు తీర్మానించారు. కలసి వెళితే కొన్ని సీట్లు పెరుగుతాయనేది ఇరుపార్టీల ఆలోచనగా ఉండేది. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 28 నియోజకవర్గాల్లో తొలివిడత పోలింగ్ ఏప్రిల్ 26కు ముందే హాసన్ జిల్లా వ్యాప్తంగా జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల పెన్‌డ్రైవ్‌లు వైరల్ అయ్యాయి. పోలింగ్ ముగిసిన రాత్రే ప్రజ్వల్ జర్మనీదేశానికి పరారీ కావడంతో రాజకీయాలను, ఆ తర్వాతి పరిణామాలను కుదిపేశాయి. ఈలోగానే ఆరు విధానపరిషత్ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. మరో మూడు రోజుల్లో ఉత్తర కర్ణాటక పరిధిలోని 14 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఉత్తర కర్ణాటకలో తిరుగులేదని భావించిన బీజేపీకి అడుగడుగునా పెన్‌డ్రైవ్ వ్యవహారం బెడిసికొట్టేలా మారింది. ఈ పరిణామంతో జేడీఎస్‌తో కలసి ప్రయాణం బీజేపీ నిండా మునిగేందుకు కారణమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తం కావడంతో మైత్రికి పెన్‌డ్రైవ్ బీటలు ఏర్పడినట్లుగా తెలుస్తోంది. ప్రజ్వల్ రాసలీలల వ్యవహారం హాసన్ నుంచి అంతర్జాతీయస్థాయికి చేరింది. ఇటీవల వారం రోజులుగా నేషనల్ మీడియా ఇదే ప్రధాన అంశంగా ప్రసారం చేసింది. ప్రజ్వల్ పెన్‌డ్రైవ్‌లో వందలాది మంది బాధితులు ఉండడంతో సర్వత్రా వ్యతిరేకత పెరుగుతోంది. ప్రజ్వల్ తరపున ప్రచారం చేసిన ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు వివిధ రాష్ట్రాల ప్రచారసభల ద్వారా జాతీయస్థాయిలో చెడ్డపేరు తెచ్చేందుకు ప్రయత్నించారు. వాటిని తిప్పికొట్టేలా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దావణగెరె, శివమొగ్గ ప్రచారసభల్లో స్పందించారు. మాతృమూర్తులపై దౌర్జన్యం చేసినవారిని బీజేపీ ఎప్పటికీ వెనకేసుకురాదని తేల్చి చెప్పారు. దీన్నిబట్టి జేడీఎస్‌తో కలసి ముందుకు సాగడం బీజేపీ నేతల్లో కష్టమేనని పిస్తోంది. జేడీఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ కాగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన కుమారుడు కుమారస్వామి ఉన్నారు. జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడిగా కుమారస్వామి తనయుడు నిఖిల్ కొనసాగుతున్నారు. ఇక దేవెగౌడ మరో కుమారుడు రేవణ్ణ రాసలీలల వ్యవహారంలో అరెస్టు అయ్యారు. ఆయన కుమారుడు ప్రజ్వల్ హాసన్ ఎంపీగాను అభ్యర్థిగాను ఉన్నారు. ఇక రేవణ్ణ మరో కుమారుడు సూరజ్ ఎమ్మెల్సీగా వ్యవహరిస్తున్నారు. దీన్నిబట్టి దేవెగౌడ కుటుంబం చుట్టే జేడీఎస్ పార్టీ అల్లుకుంది. కేసుల్లో ఎదుర్కొంటున్నారని ఒకరిద్దరిని దూరం చేసినా వారంతా ఒకే కుటుంబం కావడంతో నిరంతరంగా ఈ అంశంపై బీజేపీ వివరణ ఇచ్చుకోవాల్సి ఉంటుందనే వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది.

పరిషత్ పోరులో మార్పులు..

రాష్ట్రంలో రెండో విడత లోక్‌సభ పోలింగ్ ముగియగానే మూడు పట్టభద్రులు, మూడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రకటించేందుకు ఒక్కరోజు ముందే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సొంతంగా జేడీఎస్ పార్టీ గెలుపొందిన దాఖలాలు కొన్నేళ్లకిందట సాధ్యమైందని ప్రస్తుత పరిస్థితుల్లో వారు ఒంటరిగా పోటీ చేయరనే అభిప్రాయాలు ఉన్నాయి. జేడీఎస్‌తో కలసి ఎమ్మెల్సీ ఎన్నికలకు వెళ్తే పెన్‌డ్రైవ్ వ్యవహారం మరింత కీలకంగా మారి ఉంటుందని అప్పుడు ప్రతిచోటా ఇదే వివరణ ఇచ్చుకోవాల్సి ఉంటుందని సొంతంగానే పోటీ చేద్దామని బీజేపీ వర్గాల అభిప్రాయంగా ఉన్నట్లు తెలుస్తోంది. సంఘ్‌పరివార్ ముఖ్యులు కూడా బీజేపీకి ఇదే సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కలిగ ఓటు బ్యాంకు కలసి వస్తుందని భావించామని ఎమ్మెల్సీ ఎన్నికల్లో భిన్నమైన అంశాలు ముడిపడి ఉంటాయని మైత్రి అవసరం లేదని ఒకవేళ కొనసాగిస్తే వ్యతిరేకత తీవ్రమవుతుందనే చర్చలు పెరిగినట్లు తెలుస్తోంది. అధిష్ఠానానికి ఇదే అభిప్రాయాన్ని చేరవేసినట్లు సమాచారం. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో హాసన్‌లో బీజేపీ నుంచి ఆశించినంత మద్దతు లభించలేదని దేవెగౌడ ఆరోపించారు. హాసన్ బీజేపీ ముఖ్యనేత, మాజీ ఎమ్మెల్యే ప్రీతంగౌడ మైసూరు, చామరాజ నగర నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌గా నియమించడం వెనుక కుట్ర ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. ప్రీతంగౌడ మద్దతుదారులు కాంగ్రెస్ తరఫున ప్రచారం చేశారనే వీడియోలు హల్‌చల్ చేశాయి. ఇటువంటి తరుణంలో జేడీఎస్‌తో బీజేపీ పొత్తు కొనసాగడం కష్టమేనని తెలుస్తోంది.

అంతర్మథనంలో జేడీఎస్ ఎమ్మెల్యేలు



ప్రస్తుతం జేడీఎస్ పార్టీ తరపున 19మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. హెచ్‌డీ కుమారస్వామి, రేవణ్ణలు మినహా మరో 17మంది ఉన్నారు. రాసలీలల వివాదం బయటకు వచ్చాక జేడీఎస్ ఎమ్మెల్యేలు ఇద్దరు బహిరంగంగానే ప్రజ్వల్‌పై వేటు వేయకపోతే పార్టీ మునిగిపోతుందని అభిప్రాయపడ్డారు. ఇటీవల రెండు మూడు రోజులుగా ఏకంగా 14మంది ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్నారనే ప్రచారం హల్‌చల్ చేస్తోంది. ఇందుకు కుమారస్వామి ఎటువంటి వ్యాఖ్య చేయకపోగా కాంగ్రెస్ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ అటువంటి ప్రస్తావన రాలేదని చెప్పడం వెనుక ఏదో కుట్ర సాగుతోందనే అభిప్రాయాలు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత భారీగా రాజకీయ మార్పులు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్న తరుణంలో ఏమైనా జరగవచ్చునని భావిస్తున్నారు. ఒకవేళ జేడీఎస్ ఎమ్మెల్యేలు గుడ్‌బై చెబితే బీజేపీ వారి వెంట నడిచే ప్రక్రియ మరింత సన్నగిల్లుతుందని తెలుస్తోంది.

ప్రజ్వల్ గెలిస్తే ఎన్డీయే నుంచి సస్పెన్షన్: బీజేపీ నేత అశోక్

బెంగళూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): హాసన్ నుంచి ప్రజ్వల్ విజయం సాధిస్తే ఎన్డీయే నుంచి సస్పెండ్ చేస్తామని ప్రతిపక్షనేత అశోక్ తెలిపారు. బీజేపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన లైంగిక దౌర్జన్యాలు, మహిళలకు వేధింపులు అంశాన్ని బీజేపీ ఉపేక్షించేది లేదన్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి ప్రజ్వల్ అన్నారు. అప్పుడు సంకీర్ణ ప్రభుత్వ సమన్వయ కర్తగా వ్యవహరించిన సిద్దరామయ్య ప్రజ్వల్ యంగ్ లీడర్, విజన్ లీడర్ అంటూ కొనియాడారని.. ప్రస్తుతం ఆయనే మాట్లాడాలన్నారు. తాను హాసన్‌లో ప్రచారం చేయకుంటే ప్రజ్వల్ గెలిచేవాడా... అని వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ ఐదేళ్ల పదవీకాలంలోనే ప్రజ్వల్ విజన్ చూపారని వ్యంగ్యం చేశారు. ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణను సిట్ పోలీసులు అరెస్ట్ చేయడం సమంజసమన్నారు. పోలీసుల చర్యను అభినందిస్తున్నానని, తప్పు చేసినవారికి శిక్ష పడాల్సిందేనన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న అశోక్

మలివిడత ప్రచారానికి తెర



- హోరాహోరీగా సాగిన రెండో విడత ప్రచారం
- మోదీ, అమిత్‌షా సుడిగాలి పర్యటన
- వెనుదిరిగిన అగ్రనేతలు
- 14స్థానాలకు 227మంది అభ్యర్థులు
- రేపటి పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



దావణగెరె పరిధిలోని హొన్నాళి ప్రచారసభలో మొక్కకు నీరు పోస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరకర్ణాటక పరిధిలోని 14 లోక్‌సభ స్థానాల్లో గెలుపుకోసం రసవత్తరంగా సాగిన ప్రచారం ముగిసింది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రచారానికి తెరపడడంతో అగ్రనేతలు వెనుదిరిగారు. రాష్ట్రంలో గత ఏడెనిమిదేళ్లలో ఎప్పుడూ లేనంతగా ఎండల తీవ్రతలోనూ ప్రచారం జోరుగా కొనసాగింది. మంగళవారం 14 స్థానాలకు పోలింగ్ జరగనుంది. వీటిలో చిక్కోడి, బెళగావి, బాగల్కోటె, విజయపుర, కలబురగి, రాయచూరు, బీదర్, కొప్పళ, బళ్ళారి, హావేరి, ధారవాడ, దావణగెరె, శివమొగ్గ, ఉత్తరకన్నడ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలో రెండో విడత జరిగే ఎన్నికల్లో 14 స్థానాలనుంచి 227మంది అభ్యర్థులు బరిలో ఉండగా 2,59,17,493మంది ఓటర్లు ఉన్నారు.

- రెండో విడత ఎన్నికల వేళ అగ్రనేతల ప్రచారం సాగింది. ప్రధాని నరేంద్రమోదీ మూడు రోజుల పాటు రాష్ట్రంలోనే తిష్ట వేశారు. బెళగావి, శిరసి, హొస్పేట మరుసటి రోజు బాగల్కోటె బహిరంగసభల్లో పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పలు ప్రాంతాల్లో సుడిగాలిలా తిరిగారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, రాహుల్‌గాంధీ, సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లతో పాటు పలువురు ప్రచారంలో బిజీబిజీగా గడిపారు.
- ఎన్నికల వేళ హుబ్బళ్ళిలో కళాశాల విద్యార్థిని నేహా హిరేమఠ దారుణహత్య రాజకీయంగా తీవ్రమైన చర్చకు కారణమైంది. పిత్రార్జిత ఆస్తులకు పన్నులు వసూలు విషయమై కాంగ్రెస్ సీనియర్ నేత, సలహాదారుడు శ్యామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు హల్‌చల్ చేశాయి. ఓబీసీ కోటాలో ముస్లింలను చేర్చడం ద్వారా కాంగ్రెస్ మతాలపై రిజర్వేషన్‌లు ఇచ్చేందుకు సిద్ధమయ్యిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ఆరోపణలు హాట్‌టాపిక్‌గా మారాయి. ఇదే సందర్భంలోనే హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పెన్‌డ్రైవ్ వివాదం ఏకంగా ఎన్నికల ప్రచారాన్ని కుదిపేసింది. చివరిరోజు హోరాహోరీగా ప్రచారం సాగింది. బీజేపీ నుంచి పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర శివమొగ్గ లోక్‌సభ పరిధిలోని శిరాళకొప్పలో ప్రచారం చేయగా సీటీ రవి దావణగెరెలో ప్రచారం చేశారు. యడియూరప్ప, భారతిశెట్టిలు శివమొగ్గలోనూ, కోట శ్రీనివాసపూజారి, సునిల్‌కుమార్‌లు ఉత్తరకన్నడలోనూ, గోవింద కారజోళ బాగల్కోటెలోనూ, బసనగౌడ పాటిల్ యత్నాళ్ బిజాపూర్‌లోనూ, చలవాది నారాయణస్వామి బీదర్‌లోనూ, అరవింద లింబావళి గదగ్‌లోనూ, యదువీర్ కొప్పళలోనూ, శోభాకరంద్లాజె గుల్బర్గాలో, తేజస్వి సూర్య విజయనగరలో, మాళవిక అవినాశ్ దావణగెరెలో ప్రచారం చేశారు.

కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, సుర్జేవాలాతో కలసి మీడియాతో మాట్లాడారు. అనంతరం దావణగెరె నియోజకవర్గ పరిధిలోని హొన్నాళి, హరిహర ప్రాంతాల్లో బహిరంగసభల్లో భాగస్వామ్యులయ్యారు. హరిహర పంచమశాలి గురుపీఠాన్ని సందర్శించి వచనానందస్వామీజీ ఆశీస్సులు పొందారు.

శివమొగ్గలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ప్రచారం



6360938947

- ప్రజ్వల్ బాధితుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్
- సిట్ అధికారుల ముందుకు మరో ముగ్గురు..
- ఏ క్షణంలోనైనా నగరానికి హాసన్ ఎంపీ
- మూడు రోజుల కస్టడీకి రేవణ్ణ



బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల పెన్‌డ్రైవ్ వివాదంపై సిట్ అధికారులు విచారణను వేగవంతం చేశారు. ప్రజ్వల్ బాధితులకోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. బాధితులకు న్యాయం, భద్రత కల్పించే విషయమై హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు సిట్ అధికారులు ప్రకటించారు. 6360938947 నెంబరును హాసన్‌లో హెల్ప్‌లైన్ కోసం కేటాయించినట్లు తెలిపారు. రేవణ్ణ అరెస్టుతో మరో ముగ్గురు బాధితులు సిట్ అధికారులను సంప్రదించినట్లు సమాచారం. మరోవైపు వీడియోలో ఉండే మహిళా అధికారులకు సిట్ నోటీసులు జారీ చేస్తుండగా అందులో లేనంటూ పలువురు దాటవేసినట్లు తెలుస్తోంది. వీడియోలో పలువురు మహిళా ఉద్యోగులు, అధికారులు ఉన్నట్లు సిట్ గుర్తిస్తోంది. కొందరు మహిళా అధికారులు విచారణకు వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. కాగా హాసన్‌లోని ఎంపీ క్వార్టర్స్‌ను సిట్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. అందులోని ప్రతి వస్తువును క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. 2019లో మాజీ ప్రధాని దేవెగౌడ కోసం ఈ భవనాన్ని నిర్మించారు. హాసన్‌కు దేవెగౌడ వస్తే అక్కడే సేదతీరేవారు.

- కాగా హొళెనరసీపురలో మౌనం ఆవరించినట్లుగా మారింది. నిత్యం రేవణ్ణ నివాసం సందర్శకులతో నిండి ఉండేది. ఇటీవల వారం రోజులుగా ఆయన నివాసానికి ఒక్కరు కూడా రావడం లేదు. బుధవారం ఇంట్లో హోమాలు జరిపించగా గురువారం ఓ అర్చకుడు ప్రసాదం ఇచ్చేందుకు రాగా సిట్ అధికారులు పరిశీలన చేసి పంపారు. రేవణ్ణ నివాసాన్ని పంచనామా చేశారు.

రాత్రంతా విచారణ

రేవణ్ణను శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్న సిట్ అధికారులు కార్యాలయానికి తరలించారు. రాత్రి పొద్దుపోయేదాకా రేవణ్ణ విచారణ జరిపినట్లు సమాచారం. కిడ్నాప్‌తో తనకెటువంటి సంబంధం లేదని అధికారుల ఎదుట రేవణ్ణ పదే పదే ప్రస్తావించినట్లు తెలుస్తోంది. మరోవైపు కిడ్నాప్ కు గురైనట్లుగా ప్రచారం సాగిన బాధిత మహిళకు శనివారం విముక్తి కల్పించిన విషయం తెలిసిందే. ఆదివారం సాయంత్రం రేవణ్ణను కోరమంగలలోని జడ్జ్ క్వార్టర్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ న్యాయమూర్తి రవీంద్ర కొట్టిమని ఎదుట హాజరు పరిచారు. అక్కడ నుంచి నేరుగా శివాజీనగర్‌లోని బౌరింగ్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇదే సందర్భంలోనే ఆయన మీడియాతో మాట్లాడారు. కిడ్నాప్ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని అయినా అరెస్టు చేశారన్నారు. ఆసుపత్రిలో ఆయనకు పలు విధాలా వైద్య పరీక్షలు జరిపారు.

9 రోజులుగా పరారీలో ప్రజ్వల్

ఏప్రిల్ 26న పోలింగ్ జరిగిన రోజు అర్ధరాత్రి తర్వాత ప్రజ్వల్ రేవణ్ణ బెంగళూరు నుంచి డిప్లమాటిక్ పాస్‌పోర్ట్ ద్వారా జర్మనీకి వెళ్లారు. అక్కడనుంచి దుబాయ్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రజ్వల్‌ను రప్పించాలని కాంగ్రెస్ మహిళా సంఘాలు భారీగా నిరసన చేపట్టారు. ప్రజ్వల్ రోజుకు రెండుసార్లు ఓ యువతికి ఫోన్‌కాల్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజ్వల్‌కు మే నెలలోనే ఓ యువతితో నిశ్చితార్థం ఉండేదని, ఆ యువతికి మాత్రమే ఫోన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. యువతిపైనా పోలీసులు నిఘా పెట్టారు.

ఏ క్షణంలోనైనా బెంగళూరుకు..

రాసలీలల పెన్‌డ్రైవ్ వివాదం కీలక సూత్రధారి ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బెంగళూరుకు ఏ క్షణంలోనైనా వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో సిట్ అధికారులు మకాం వేశారు. మధ్యాహ్నం 3 గంటలకే ప్రజ్వల్ బెంగళూరుకు వస్తారనే సమాచారం హల్‌చల్ చేసింది. అయితే ప్రజ్వల్ ఆచూకీ కానరాలేదు. సాయంత్రం 6 గంటల నుంచి 6.30 గంటల మధ్యన దుబాయ్ నుంచి రెండు విమానాలు వస్తున్నాయని వీటిలో ప్రజ్వల్ వస్తారనే సమాచారంతో మీడియా, సిట్ అధికారులు వేచిచూశారు. అయితే ప్రయాణీకుల జాబితాలో ప్రజ్వల్ పేరు లేదు. రాత్రి పొద్దుపోయాక ప్రజ్వల్ బెంగళూరుకు చేరుకుని నేరుగా సిట్ ముందు హాజరవుతారని ప్రచారం సాగుతోంది. తండ్రి రేవణ్ణ అరెస్టుతో ప్రజ్వల్ బెంగళూరుకు తీసుకురావాలని న్యాయవాదులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.



ప్రజ్వల్‌కు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల నిరసన (ఫైల్)